01ATP22F_01ATP22F.qxd 22-10-2024 PM 11:07 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 23 అక్టోబర్ 2024 పేజీలు : 04

ఉపాధిహామీ పనుల్లో అంతులేని అవినీతి, అక్రమాలు..!

- బోగస్ కూలీల పేర్లతో లక్షలాది రూపాయలు దిగమింగిన వైనం
- లత్తవరం తండాలో ఆశ కార్యకర్త, అంగన్‌వాడీ హెల్పర్లకు కూలీ డబ్బులు
- రాయంపల్లిలో డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఫైనాన్షియర్లు కూడా ఉపాధి కూలీలే
- ఉరవకొండలో ఇంకుడు గుంతల తవ్వకాల్లో రూ.2.9 లక్షలు అక్రమాలు
- రూ.78.66 లక్షలు దుర్వినియోగాన్ని తేల్చిన సామాజిక తనిఖీ బృందాలు
- రసవత్తరంగా కొనసాగిన సామాజిక తనిఖీ ఉరవకొండ ప్రజా వేదిక

ప్రజా వేదికలో వివరాలు బయట పెడుతున్న సామాజిక తనిఖీ బృందాలు

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో అంతులేని అవినీతి జరిగింది. అధికారులు, క్షేత్ర సిబ్బందితో కుమ్మక్కై పనికి రాని, జాబ్ కార్డులు కూడా లేని బోగస్ కూలీలను సృష్టించి మస్టర్లువేసి, చేయని పనులను చేసినట్లు ఎంబుక్‌లు రికార్డులు చేసి అడిగేవారు లేరన్నట్టు లక్షలాది రూపాయలను అప్పన్నంగా దోచేశారు. ఉళ్లల్లోలేని ఎక్కడో కర్నాటక రాష్ట్రంలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, ఫైనాన్షియర్లు కూడా కూలిపని చేసినట్లు వేలు, లక్షల రూపాయలు కూలి డబ్బులను వారి ఖాతాల్లో జమ చేశారు. ఉరవకొండ మండలంలోని 18 గ్రామ పంచాయతీ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను 9,15,44,366 రూపాయల విలువైన పనులు జరుగగా అందులో కూలీలకు 5,90,95,274 రూపాయలు, మెటీరియల్‌కు 3,24,49,092 రూపాయలు ఖర్చు చేశారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా 78,66,935 రూపాయలు నిధులు దుర్వినియోగం అయినట్లు తేల్చింది. వాటి వివరాలను మంగళవారం నిర్వహించిన ప్రజా వేదికలో వెల్లడించారు.

వివరాల్లోకి వెళితే...

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం ఎంపీడీఓ రవిప్రసాద్ అధ్యక్షతన జరుగగా ఎంపీపీ నరసింహులు, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎస్టీఎం కోనయ్య, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ, ఉపాధిహామీ ఏపీఓ విమల హాజరయ్యారు. ప్రజా వేదిక ఆద్యంతం సామాజిక తనిఖీ బృందాలు విస్తుపోయే అనేక అంశాలను బహిర్గతం చేశారు. ప్రతి గ్రామంలోనూ పనికేరాని, కనీసం జాబ్ కార్డులు కూడా లేని పదుల సంఖ్యలో బోగస్ కూలీలను సృష్టించి వారు పనులు చేసినట్లు వేలు, లక్షలాది రూపాయలను అక్రమాలకు పాల్పడినట్లు బహిర్గతం చేశారు. లత్తవరం తండాలో వెంకటలక్ష్మి అనే ఆశ కార్యకర్త కూలిపని చేసినట్లు ఆమెకు 7వేల రూపాయలు, అంగన్‌వాడీ కార్యకర్త సరస్వతికు 12,770 రూపాయలు, క్షేత్ర సహాయకుడు అంజినేయులు నాయక్ తనతోపాటు తన భార్య జీవిత కూడా పనిచేసినట్లు చెరో 7,104 రూపాయల చొప్పున కూలి డబ్బులు ఖాతాల్లోని జమ చేసుకున్నట్లు వెల్లడించారు. ఎంఐ ట్యాంకు పని

అధికారులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చేయకపోయినా చేసినట్లు 3 లక్షలు బిల్లు చేశారని, పని చేయని, చేయలేని దివ్యాంగులు, వీఓఏ, బెంగళూరులో ఉన్న వారిని కూడా కూలీలుగా చేసి కూలి డబ్బులు దిగమింగారని వెల్లడించారు. నెరమెట్ల పంచాయతీలో 1.30 లక్షల రూపాయలను పనిచేయని వారి ఖాతాల్లో జమ చేశారని, 30 మందికి వారి సంతకాలు లేకుండా కూలి డబ్బులు ఇచ్చినట్లు నిర్ధారించారు. ఉరవకొండ పట్టణంలోని కొలిమి, రాయంపల్లి లేఅవుట్లలో గృహనిర్మాణశాఖ ద్వారా గృహాలవద్ద జరిగిన ఇంకుడు గుంతల ఏర్పాటులో అవినీతిని బయటపెట్టారు. 59 ఇంకుడు గుంతల తవ్వకాల్లో 2.90 లక్షలు దుర్వినియోగం అయిందని వెల్లడించారు. చివరికి మోక్కలు నాటడంలో జరిగిన అక్రమాలను బయటపెట్టారు. రాయంపల్లి పంచాయతీలో జరిగిన విస్తుపోయే అక్రమాలను వెల్లడించారు. ఎక్కడో బెంగళూరులో ఉంటున్న వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఫైనాన్షియర్లు కూడా కూలి పనిచేసినట్లు చూపి కేవలం గడిచిన 6 నెలల్లోనే 5 లక్షల రూపాయలు వారి ఖాతాలకు జమ చేసినట్లు ఆధారాలతో బయట పెట్టారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ లక్షల రూపాయలు అతినీతి, అక్రమాలను బయటపెట్టారు.

రూ.9.29 లక్షలు రికవరీకు ఆదేశం:

మండలంలో 78,66,935 రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని సామాజిక తనిఖీ బృందం అవినీతి, అక్రమాలను బయటపెట్టగా ప్రజావేదికకు హాజరైన డ్వామా పీడీ సలీమ్‌బాషా నేతృత్వంలోని బృందం 62,11,720 రూపాయలను డ్రాప్ చేసి కేవలం 9,29,014 రూపాయలను

మిగతా 4 లో...

అనంతపురం జిల్లాలో భారీ వర్షం

- రాప్తాడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గాల్లో భారీ నష్టం
- ఉధృతంగా ప్రవహిస్తున్న పండమేరు
- శివారు కాలనీలు జలమయం
- వరద నష్టం ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి పర్యటన

జలమయమైన అనంతపురం శివారు కాలనీ

వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యేలు

అనంతపురం, అక్టోబర్ 22 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురంజిల్లాలో గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని చోట్ల భారీ వర్షం బీభత్సం సృష్టించడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్లపై నీరు రావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గంలో భారీ వర్షం కురవడం, చెరువులు నిండిపోవడంతో పండ మీరు వంక ఉధృతంగా ప్రవహించి అనంతపురం నగర శివారు కాలనీలు జలమయం అయ్యాయి. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తదితరులు వర్షంతో నష్టం జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. అధికారులతో కలిసి బాధజతులకు సహాయ సహకారాలు అందించేందుకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో సోమవారం రాత్రి భారీ వర్షాలు కురవడంతో పలు చోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలో జాతీయ రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కియా ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో కలిసి జేసిబి సహయాంతో వరద నీటిలో చిక్కుకున్న వాహనాలను బయటకు తరలించారు. అక్కడ ఐదు కి.మీ.ట్రాఫిక్ అగినట్లు తెలుస్తోంది. మరోవైపు అనంతపురం నగర శివారులోని పలు కాలనీల్లోకి నీరు భారీగా చేరింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ముందస్తుగా కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్వయంగా అక్కడికి వెళ్లి పర్యవేక్షించారు.

అనంత శివారు కాలనీలు జలమయం..

రాప్తాడు నియోజకవర్గంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాల కారణంగా పండమేరు వంక గత రాత్రి నుంచి ఉధృతంగా ప్రవహించడంతో శివారుకాలనీలో జలమయమై ప్రజలు అనేక ఇక్కట్లకు గురయ్యారు. అనంతపురం రూరల్ పంచాయితీలోని రామకృష్ణ కాలనీ, నారాలోకేష్ కాలనీ, సుశీలరెడ్డి కాలనీ, తిమ్మానాయుడు కాలనీ, అభ్యుదయ కాలనీల్లోని వరద నీరు వచ్చింది. దీంతో కాలనీలో వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాత్రి నుంచి అధికారులను అప్రమత్తం చేశారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి సహాయక చర్యలు చేపట్టారు. వరద బాధితుల కోసం జెఎన్టఇయూ వద్దనున్న ఎలక్ట్రిసిటీ బోర్డు గెస్ట్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు.

బాధితులకు అండగా ఉంటాం.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ఇవాళ ఉదయం వరద ప్రభావిత కాలనీలో ఎమ్మెల్యే దగ్గుపాటి పర్యటించారు. బాధితులందరిని పరామర్శించారు. ఇళ్లలోకి నీరు చేరి భారీగా నష్టపోయామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధైర్య పడవద్దని ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుందని దగ్గుపాటి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. వరద బాధితుల కోసం కేంద్రం కూడా ఏర్పాటు చేశామని,

మిగతా 4లో...

తెగిన కనగానపల్లి చెరువును పరిశీలిస్తున్న పరిటాల సునీత

నిర్దేశిత లక్ష్యాలను అధిగమించండి

శ్రీసత్యసాయిజిల్లా, అక్టోబర్ 22, ప్రభాతవార్త ప్రతినిధి:

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కోర్టు హాలు నందు డ్వామా, డిఎస్‌డిఎ, జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఇ, స్కిల్ డెవలప్‌మెంట్, గ్రామీణ నీటి పారుదల, వికసిత్ ఆంధ్ర 2047, 100 రోజుల్లో చేపట్టే పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీజాతీయ ఉపాధి హామీపథకం నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేసి, పనిదినాలు జనరేట్‌అయ్యేలాచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వికసిత్ ఆంధ్ర 2047 యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా ప్రత్యేక కృషి చేయాలని, ఈ నెల 24 తేదికి మంచినీటి ట్యాంకులు శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలని, చెత్తనుండి సంపద కేంద్రాలుమరమ్మత్తు చేసి వినియోగంలోకి తేవాలని, ఎస్‌డబ్ల్యూపిసి నిర్మాణాలు డివిజన్ వారీగా మండలాల వారీగా నివేదికలు అందించాలని జిల్లాపంచాయతీఅధికారిని ఆదేశించారు. ఆగస్టు నెలలో మడకశిర పరిధిలోని గుండుమలలో ప్రజా వేదిక సందర్భంగా ముఖ్యమంత్రి జిల్లా పర్యాటనలో ఇచ్చినహామీల మేరకు పనులు వేగవంతం చేయాలన్నారు. 100 రోజులకార్యాచరణప్రణాళిక అమలు చేయాలని, డిఆర్‌డిఎ ఉన్నతి,పురోగతి నివేదికను నవీకరించాలని, లక్ష్యాలను సాధించాలని, ఆర్‌డబ్ల్యూఎస్‌లో పెండింగ్‌లోఉన్న అన్ని పనులను ఒక వారంలో పూర్తిచేయాలని, జిల్లా పరిశ్రమల శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహజంచాలని, అందుకు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రధాన మంత్రివిశ్వకర్మ యూనిట్లకు అర్హుల జాబితా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నరసయ్య, డ్వామా పిడి విజయేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ మల్లికార్జునప్ప, పంచాయతీరాజ్ ఎస్ఇ మురళీకృష్ణ, డిపిఓ సమత, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, తదితరులుపాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్

భారీవర్షాలతో అప్రమత్తంగా ఉండండి

జిల్లాలో భారీగాకురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాగులు, వంకల క్రింద ఉన్న లోతట్టు గ్రామాలప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోనే కాక ఎగువన ఉన్న కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండడంతో మన జిల్లాకు వచ్చే వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తాయని, కావున ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

తెగిన హంద్రీనీవా కాలువను తక్షణమే పునరుద్ధరించండి : మంత్రి సవిత

పెనుకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

నియోజకవర్గ పరిధిలోని సోమందేపల్లి మండలంలో హంద్రీనివా సుజల స్రవంతి కాలువ మరమ్మత్తుల పనులు పవెంటనే చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత నీటిపారుదల శాఖ అధికారులను మంగళవారం ఆదేశించారు. సోమవారం కురిసిన భారీ వర్షాలకు మంచేపల్లి గ్రామం వద్ద హంద్రీ నివా సుజల స్రవంతి(హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ తెగి పోయిన విషయం తెలుసుకున్న ఆమె వెంటనే స్పందించారు. స్థానిక హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం అమరావతి నుంచి పోన్లో మాట్లాడారు. తక్షణమే కాలువ గండి పూడ్చి నీరు వృథాను అడ్డుకోవాలని ఆదేశిం చారు. కాలువ తెగిపోవడం తో జరుగుతున్న పరిస్థితిని ఆమె అధికారులతో అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం జరగలేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వరద నీరంతా పందిపర్తి చెరువు, మంచేపల్లి చెరువుల్లోకి చేరుతోందని వెల్లడించారు. మంచేపల్లి చెరువులో ఇప్పటికే వంద శాతం నీరడు చేరిందన్నారు. ఆ చెరువు నిండిన తర్వాత పక్కనున్న ఈదుల బళాపురం చెరువులోకి వరదనీరు వెళ్లనుందని మంత్రికి వివరించారు. హంద్రీనివా నీరడు చేరుతున్న చెరువు కట్టలను కకూడా బలోపేతం చేయాలని మంత్రి సవిత సూచించారు. రాబోయే నాలుగు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు.

పోన్లో నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

వరద పరిస్థితిపై అనునిత్యం మానిటరింగ్

- కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి ఎప్పకటిప్పుడు అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

జిల్లాలో వరద పరిస్థితి, పునరావాస కేంద్రాల ఏర్పాటు, వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అనునిత్యం మానిటరింగ్ చేస్తున్నామన్నారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పై నుండి పెద్దఎత్తున వరద రావడంతో అనంతపురం అర్బన్, రూరల్, రాప్తాడు, ఆత్మకూరు. ఉప్పరపల్లి, జగనన్న కాలనీ, ఆటోనగర్, విన్సెంట్ డిపాల్ స్కూల్, పండమేరు. తదితర ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయికి జాయింట్ కలెక్టర్, డిఎంహెచ్ఓ, ఆర్డీఓ, ఉద్యాన, ఇతర శాఖల అధికారులను పంపి వరద పరిస్థితులు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, వసతుల కల్పనపై చర్యలకు ఆదేశాలిచ్చారు. ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వరద పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ రిక్వెస్ట్ చేయడంతో కర్నూల్ నుండి రెండు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు అనంతపురంకు మంగళవారం మధ్యాహ్నానికి చేరుకున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వరదనీరు అనంతపురం జిల్లాలో ఏ ప్రాంత నుండి ఏ ప్రాంతం వరకు వెళుతుందనే అంశంపై మ్యాప్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలిస్తూ వివరాలను మైనర్ ఇరిగేషన్ అధికారుల నుండి తెలుసుకుని పలు సూచనలను జారీ చేశారు. ఉద్యాన పంటల నష్టాల వివరాల నివేదికను తెప్పించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రామకృష్ణారెడ్డి, డిటిసి వీర్రాజు, సిపిఓ అశోక్‌కుమార్, డిపిఎం ఆనంద్, జిల్లా సైనిక్ సంక్షేమశాఖ అధికారి పి.తిమ్మప్ప, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, వ్యవసాయశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద ప్రాంతం పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పి జగదీష్

వరద ప్రాంతంలో పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

వరద ప్రాంతం పరిసరాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

గోరంట్ల పోలీసుస్టేషన్‌పై దండయాత్ర

- ఎస్ఐ మాట తీరు సరిగా లేదని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్ ఫైర్
- పెళ్లి ఊరేగింపులో వ్యక్తులపై కేసులు కట్టారు..అడిగితే నిర్లక్ష్య సమాధానం

గోరంట్ల, అక్టోబర్ 22 ప్రభాతవార్త

వైసిపి నాయకులపై టిడిపి శ్రేణుల ఫిర్యాదు మేరకు అక్రమ కేసులు నమోదు చేశారని ఆ కేసు వివరాల కోసం ఎస్ఐ శ్రీనివాసులుకు ఫోన్ చేస్తే బాధ్యత లేకుండా మాట్లాడడని అందుకు నిరసిస్తూ మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ గోరంట్ల పోలీసుస్టేషన్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మంగళవారం ఉదయం గోరంట్ల మండలంలోని గడ్డంతాండాలో వైసిపి నాయకులపై గోరంట్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన సంఘటనపై స్థానిక ఎస్ఐ శ్రీనివాసులుకు ఫోన్ చేసి వివరాలు అడిగితే బాధ్యత లేకుండా మాట్లాడాడని అందుకు ఆగ్రహిస్తూ మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్ మండల పార్టీ శ్రేణులతో కలిసి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో సిఐ, ఎస్ఐలు లేకపోవడంతో ఆమె తన అనుచరులతో సిహెచ్ చాంబర్‌లో కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న సిఐ శేఖర్ అక్కడికి చేరుకుని మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్‌కు జరిగిన వివరాలు తెలియచేశారు. అయితే ఆమె స్పందిస్తూ ఒక మాజీ మంత్రి ప్రస్తుత స్థానిక జిల్లా అధ్యక్షురాలు అయిన నాలాంటి వాళ్లకే పోలీసులు ఇంత నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇంతలోనే అక్కడికి చేరుకుని ఎస్ఐ శ్రీనివాసులు మాజీ మంత్రికి సమాధానం ఇస్తూ నేను బాధ్యత లేకుండా మాట్లాడలేదని మీరు తప్పుగా అనుకున్నారంటూ సమాధానం ఇచ్చారు. సిఐ శేఖర్ స్పందిస్తూ బాధితుల ఫిర్యాదు మేరకు మా కానిస్టేబుల్ విచారణకు వెళితే కేసు నమోదైన వ్యక్తులు కానిస్టేబుల్‌పై అసభ్యకరంగా ప్రవర్తించారని అందుకు సంబంధించిన వీడియోలు మా వద్ద వున్నయంటూ మాజీ మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణలో మాజీ మంత్రి మాట్లాడుతూ వైసిపి శ్రేణులపై ఏదో ఒక నెపంతో కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోమని వారి పక్షాన పోరాడుతామన్నారు. మంత్రి సవితమ్మ చెప్పింది వేదం అంటే ఒప్పుకోమని పోలీసుల తీరు సమానంగా వుండాలని రాష్ట్రంలో రెడ్‌బుక్ అమలు చేస్తామంటే ఒప్పుకోమని 2029లో రాష్ట్రంలో మళ్లీ వైసిపినే అధికారంలోకి వస్తుందని అప్పుడు గుడ్‌బుక్ ఓపెన్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ మేదర శంకర, జెడ్‌పిటిసి పాలే జయరాం నాయక్, నార్పింపల్లి రఘురామిరెడ్డి, రాజారెడ్డి, బాలన్న గారిపల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచు వాసునాయక్, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐతో వాగ్వవాదం చేస్తున్న మాజీ మంత్రి

బాలికోన్నత పాఠశాల ముందు అంతా బురదమయం

- ఇబ్బందుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు

కళ్యాణదుర్గం టౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త


పాఠశాల ముందు బురదమయమైన దృశ్యం

పట్టణంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ బురదమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాల వద్ద కురిసిన వర్షాలకు పాఠశాల ముందు భాగమంతా బురద మయంగా మారడంతో విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లడానికి తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు పాఠశాల ముందు వర్షపునీరు బురదతో నిండిపోవడంతో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ముందు పేరుకు పోయిన బురద తొలగించాలని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరారు.

వరుసగా కురుస్తున్న వర్షాలకు తడిచి కుళ్ళిపోయిన వేరుశనగ

- వర్షాలకు తడిచి రైతులు నష్టపోయినా అధికారులకు పట్టదా
- ఆరుగాలం శ్రమ ఒక్కవర్షంతో నష్టం

బ్రహ్మసముద్రం అక్టోబర్ 22 ప్రభాతవార్త,

చేనుపై తడిచి కుళ్ళిన వేరుశనగ

రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ఖరీఫ్ తొలకరినుండి వరుణుడు సకాలంలో వర్షాలు కురిసి పంటబాగా పండిందని సంతోషపడేలోపే వరుణుడు రైతులపై కన్నెర్రచేశారు గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన పంటను తొలగించిన రైతులు గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపోలాలలోనే వేరుశనగ పంటమెత్తం తడిచి రైతులకు కన్నిటిని మిగిల్చాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కోందరి రైతులు కోతకొచ్చిన వేరుశనగ తోలగించాలంటే వర్షాలకు వెనుకడుగువేసినా రైతుల పొలాలలోనే మెలకలు రావడంతో రైతులు తీవ్రనష్టాన్ని ఎదుర్కొంటున్నామని అవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి తడిచిన వేరుశనగను రైతుల దగ్గరనుండి వ్యాపారస్తులు తీసుకోకుండా ఎంతపడితే అంతరేటుకు ఇవ్వమంటున్నారు. వర్షాలకు నష్టపోయిన రైతులదగ్గరకు అధికారులవచ్చి పంటనష్టం అంచనాలు వేయకుండా అధికారుల పట్టీపట్టపట్టు వ్యవహారాస్తున్నారని రైతులు వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను అదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గొంచిరెడ్డిపల్లి బస్టాప్‌వద్ద గుంతలు పూడ్చిన తెదేపా నాయకులు

బ్రహ్మసముద్రం అక్టోబర్ 22 ప్రభాతవార్త,

జేసీబితో రోడ్డుకు మరమ్మత్తులు చేస్తున్న దృశ్యం

మండలంలోని గోచిరెడ్డిపల్లిలో బస్టాప్‌వద్ద వరదనీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారని కళ్యాణదుర్గం ఎంయల్ఎ అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తెలుగుదేశం నాయకులు తీసుకెళ్ళగా యుద్ధప్రాతిపదికన అధికారులకు అదేశాలు జారీచేయగా మంగళవారం గుంతలు పడినచోటకు ఎర్రమట్టిని తరలించి జేసీబితో చదునుచేసి ప్రజలు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేసినందుకు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

గోరంట్ల మాధవ్‌పై ఘాటు వ్యాఖ్యలు చేసిన టిడిపి నేతలు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కళ్యాణదుర్గం టౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా చేప ట్టిన సూపర్-6 పథకాలపై నోరు పారేసుకున్న మాజీ వైసిపి ఎంపి గోరంట్ల మాధవ్ ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ప్రజా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు నీకు కానీ నీ పార్టికి కాలనీ లేదని అన్నారు. పనికి మాలిన మాటలతోపని మాధవ్ అని అన్నారు. ఇదే నీకు పైనల్ వార్నింగ్ అంటూ ఘాటుగా హెచ్చరించారు. నువ్వు మా అధినేత చంద్రబాబు నాయుడుని, పవన్ కళ్యాణ్‌ని ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదని అదే విధంగా అలాగనే నువ్వు మాట్లాడితే నీ పద్ధతి మార్చుకోకపోతే నిన్ను తరిమి తరిమి కొడతాం అంటూ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కురుబ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర టోర్నమెంట్‌కు నార్త్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

కళ్యాణదుర్గం టౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రమైన అనంతపురంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన అండర్-19 హ్యాండ్‌బాల్ జిల్లా సెలక్షన్లలో కళ్యాణదుర్గం పట్టణములను నార్త్ ఉన్నతపాఠశాల ముగ్గురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు చల్లా కిరణ్ చౌదరి తెలియజేశారు. వారిలో శ్రీసాయి పదవతరగతిని సాయిచరణ్ 10వ తరగతి బి.సాత్విక్ 9వ తరగతిలు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి భాయ్ వీరి ఎంపికపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిభాయి ఉపాధ్యాయినీలు సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.

ఆదేపల్లిలో అవగాహన కార్యక్రమం

చిలమత్తూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలంలోని ఆదేపల్లి గ్రామానికి చెందిన వెంకటకృష్ణప్ప కుటుంబానికి చెందిన 6 మంది వ్యక్తులు పుట్టగొడుగులు తినడంతో వాంతులు సంభవించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి కుదటగా వున్నట్లు ఫోన్ ద్వారా తెలిసింది. వైద్యాధికారి తేజశ్విని ఆదేశాల మేరకు ఆదేపల్లిలో వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి విషపూరితమైన పుట్టగొడుగులు తినడం వల్ల కలిగే అనారోగ్య సమస్యల గురించి, దోమల వల్ల వ్యాపించే మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని గ్రామంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జయచంద్రకుమార్, పర్యవేక్షకులు గోవిందప్ప, జిల్లా ఏపిడమిక్ పర్యవేక్షకులు గోపి, హిందూపురం సబ్‌యూనిట్ పర్యవేక్షలు గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పి సుచిత్ర, ఆశాకార్యకర్త పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వార్త కథనానికి స్పందించిన గ్రామ సర్పంచు

శెట్టూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త

మండలంలోని లక్ష్మంపల్లి గ్రామ పంచాయితీ సర్పంచు పూజారి చిట్టెమ్మ, వార్త దినపత్రికలో మంగళవారం పంచాయితీ నిధులు బురదపాలు అనే శీర్షికకు స్పందించి నేడు తన సొంత నిధులతో వర్షపు నీరు నిల్వ ఉన్నచోట, బురదరోడ్లను చదునుచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడడం జరిగింది.

ఎల్లోటిలో పొలం పిలుస్తోంది

మడకశిర అక్టోబర్ 22 ప్రభాతవార్త;

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మడకశిర శాసనసభ్యులు ఎంఎన్.రాజు, మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు మండల పరిధిలోని కల్లుమర్రి పంచాయతీ ఎల్లోటి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంను మంగళవారం సర్పంచ్ గంగమ్మ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ తిమ్మప్ప, ఆర్ఎస్‌కె ఇంఛార్జ్ విజయ్, తేదేపా నాయకులు నరసన్న, నారాయణప్ప, నరసేగౌడ్, పెద్దమూర్తి, మధుసూధన్ గౌడ్, మారుతి, మూర్తి, సిద్దప్ప మరియు కల్లుమర్రి గ్రామ పంచాయతీ రైతులు ప్రజలు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన కమీషనర్

గుత్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

రికార్డులను కమీషనర్ పరిశీలిస్తున్న దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు సచివాలయాన్ని మంగళవారం మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు వంద శాతం చెల్లించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కమీషనర్

గుత్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న కమీషనర్

గుత్తి పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఆన్‌లైన్ సిస్టం ద్వారా టోకెన్ల పంపిణీని పరిశీలించారు. భోజనం చేస్తున్న వారితో సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో ఆహారం అందిస్తున్న సిబ్బంది పరిశుభ్రతపై వారికి సూచనలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు క్యాంటీన్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా వుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి తెలియచేశారు.

కలిసి మాట్లాడుకుందాం.. వర్క్‌లు కేటాయించుకుందాం

- మండలమీట్‌లో స్పష్టం చేసిన ఎంపిపి ప్రమీలమూర్తి

గోరంట్ల, అక్టోబర్ 22 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం మండల పరిషత్ ద్వారా వచ్చే నిధులను అందరి అభిప్రాయంతో ఎలాంటి విభేదాలు లేకుండా వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుందామని ఎంపిటిసి సభ్యులు ఎవరైనా వర్కులు కావాలని బావిస్తే ఎంపిడిఒతో గాని ఎంపిపితో గాని చర్చించుకుంటే సరిపోతుందని వాటికోసం మనస్పర్థలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామని ఎంపిపి ప్రమీలమూర్తి మండల మీట్‌లో స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఎంపిపి ప్రమీలమూర్తి అధ్యక్షతన ఎంపిడిఒ నరేంద్రకుమార్ పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మండల వ్యాప్తంగా వివిధ శాఖల్లో గత మూడు నెలలుగా జరిగిన అభివృద్ధిపై ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ 15వ ఫైనాన్స్‌లో భాగంగా 50 లక్షల నిధులు మంజూరయ్యాయని ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా వున్న ఎంపిటిసిల పరిధిలో వారి అభిప్రాయం మేరకు అసవరమైన చోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయబోతున్నట్లు తెలిపారు. నిధుల కేటాయింపులో ఎలాంటి అనుమానాలు వద్దని మనమంతా ఒకటేనని నిధులు అసవరమైన ఎంపిటిసిలు ఎంపిపితో లేదా ఎంపిడిఒతో చర్చిస్తే నిధుల కేటాయింపుకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. అనంతరం సమావేశం సజావుగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మండల జెడ్‌పిటిసి పాలే జయరాంనాయక్, వైస్ఎంపిపి నాగభూషణ్‌రెడ్డి, రామలక్ష్మమ్మ, ఎంపిడిఒ నరేంద్రకుమార్, తహశీల్దార్ మారుతిప్రసాద్, మండల ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయండి -ఆర్డీఓ వినుత

డి.హీరేహాళ్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

తహాసీల్దార్ సూచనలు ఇస్తున్న ఆర్డీఓ

వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ వినుత తహాసీల్దార్‌కు పలు సూచనలు చేశారు. మంగళవారం డి.హీరేహాళ్ మండలంలోని సోమలాపురం గ్రామం వద్ద గంగమ్మ వంకకు నిర్మించిన గండిపడ్డ చెక్‌డ్యాంను ఆర్డీఓ తహాసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. గండిపడ్డ చెక్ డ్యాంకు వెంటనే మరమ్మత్తులు చేయించి వరద నీరు వృధా కాకుండా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలైన కొత్తూరు తదితర గ్రామాల ప్రజలను ముందస్తు జాగ్రత్తలు చేపట్టి అప్రమత్తం చేయాలని ఆమె రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు రఘునాథ్, ఆంజినేయులు, ఎంపిటిసి మొండి మల్లికార్జున, తెదేపా మండల మాజీ కన్వీనర్ అంగడి రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, విఆర్ఏలు పాల్గొన్నారు.

ఒంటిమిద్దిలో చిరుతల సంచారం

- భయందోళనలో గ్రామస్థులు

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

కొండపై కనపడుతున్న చిరుత

మున్సిపాలిటి పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో చిరుతల సంచారంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని ఊరు చివరన గుట్టలో చిరుత కనిపించడంతో పొలం పనులు వెళ్లాలంటేనే బెంబేలెత్తి పోతున్నారు. ఇటీవల బోరంపల్లి-గంగవరం గ్రామాల మధ్య అరటి తోటలో చిరుత సంచారం చేసినట్లు బోరంపల్లి గ్రామస్థులు పేర్కొంటున్నారు. అప్పటి నుండి పొలం పనులకు వెళ్లాలంటేనే ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. కొండగుట్ట ప్రాంతంలో ఆహారం దొరకకపోవడంతో జనాభాసాలలోకి వచ్చి దాడులకు తెగబడుతున్నట్లు ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. ఆటవిశాఖ అధికారులు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా వ్యవహరించకుండా చిరుతలను బంధించడానికి బోన్లు ఏర్పాటు చేసి వాటిని జూలకు తరలించాలని గ్రామ ప్రజలు వాపోతున్నారు.

హెచ్చెల్సీ కెనాల్‌ను పరిశీలిస్తున్న తహాసీల్దార్

డి.హీరేహాళ్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

హెచ్చెఎల్‌సి పరిశీలిస్తున్న తహాసీల్దార్


వర్షాలకు పాడైన రహదారి

తుంగభద్ర హైలెవెల్ కెనాల్‌ను తహాసీల్దార్ అనిల్ కుమార్, విఆర్ఓ ఆంజినేయులతో కలిసి తనిఖీ చేశారు. మంగళవారం డి.హీరేహాళ్ మండల పరిధిలోని నాగలాపురం వద్ద తుంగభద్ర హైలెవెల్ కెనాల్‌ను పరిశీలిస్తూ వాటర్ లెవెల్ పెరిగిందని, కాలువ పై నిర్మించిన శిథిలావస్థకు చేరుకున్న వంతెనను పరిశీలించారు. నాగలాపురం గ్రామ రైతులు పొలాలకు వెళ్లే రహదారి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా తయారై ప్రయాణానికి సంకటంగ మారిందని రైతులు వాపోయారు. అధికారులు వెంటనే రహదారికి మరమ్మత్తులు కల్పించి ప్రయాణానికి ఆ టంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు రహదారి గుంతల మయమై ఎద్దుల బండిపై వెళ్లడానికి కూడా ఇబ్బందికరంగా మారిందని, ప్రస్తుతం పంటలు వివిధ దశల్లో ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రహదారికి మట్టి తొలించి గుంతలు పూడ్చి తమకు సహకరించాలని అన్నదాతలు విన్నవించారు.

తెదేపా నాయకుడు మృతి

నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం రూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ

మండల పరిధిలోని కాశీపురం గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు గిరిధర్ నాయుడు(63) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. గత ఐదు రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురం ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ రెండు రోజుల పాటు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కాశీపురం గ్రామానికి చేరుకొని గిరిధర్ నాయుడు భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిధర్ నాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని, ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. గిరిధర్ నాయకుడి బౌతిక కాయానికి నివాళులు అర్పించిన వారిలో మండల కన్వీనర్ ఎంఆర్ఎఫ్ హనుమంతు, హనుమంతరెడ్డి, సర్పంచులు వన్నూరుస్వామి, రాజశేఖర్‌రెడ్డి, జింజరాంపల్లి సర్పంచ్ వన్నూరుస్వామి, టిడిపి నాయకులు కాటా వెంకటేశులు, అదేన్న బసవరాజు, లక్ష్మన్న, పోట్ల రవి, సిద్దప్ప,సోమశేఖర్, ప్రసాద్, వన్నూరప్ప, సీతారాములు, రమేష్‌బాబు, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర

కంబదూరు, అక్టోబర్ 22 ప్రభాతవార్త

అమ్మవారికి జ్యోతుల భోనాలను సమర్పించేందుకు తరలి వెళ్తున్న భక్తులు

ప్రత్యేక అలంకరణలో మారెమ్మ అమ్మవారు

మండల కేంద్రంలో మారెమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుర వీధుల గుండా అమ్మవారిని ఊరేగించిన అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయంలో కొత్తగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆలయ పూజారి ఆలయంలోని అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అంతకు ముందు భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ, టెంకాయలు, జ్యోతులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో మారెమ్మ ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గ్రామస్తులంతా కలిసి సమన్వయంతో జాతరను జరుపుకోవడంతో గ్రామంలో సదండి వాతావరణం నెలకొంది.

కోనంపల్లి, గంగవరం గ్రామాలలో గ్రామ సభలు

బెలుగుప్ప, అక్టోబర్ 22 ప్రభాతవార్త

గ్రామ సభలను నిర్వహిస్తున్న తహశీల్దారు షర్మిల

మండల పరిధిలోని కోనంపల్లి, గంగవరం గ్రామాల్లో రీ సర్వే చేసిన భూములపై బెలుగుప్ప తహశీల్దారు షర్మిలా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ.. రీ సర్వే చేసిన భూముల సమస్యలు పరిష్కారం కానివి గ్రామ రైతులు అర్జీలు ఇచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు రీ సర్వే తహశీల్దారు సురేఖ, మండల సర్వేయర్ ప్రభాకర్, విఆర్ఓ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో అతలాకుతలం

- ఉప్పొంగి ప్రవహిస్తున్న వంకలు, వాగులు - మూడు గంటల పాటు జాతీయ రహదారి దిగ్బంధం
- 63హెక్టార్లలో పంటనష్టం- నేలకొరిగిన చెట్లు విద్యుత్తు స్థంబాలు

జాతీయ రహదారిపై భారీ వాహనాలను తొలగిస్తున్న ఎస్సై రాజేష్, పోలీస్ సిబ్బంది, మహాదేవపల్లి సమీపాన విద్యుత్తు లైన్ పై పడిన భారీ చెట్లు, జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద

పెనుకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

రహదారిపై నుండి వాగులోకి కొట్టుకొచ్చిన కారు ,శెట్టిపల్లి వద్ద రైల్వే అండర్ పాస్ కింద ప్రవహిస్తున్న వదర నీరు

పెనుకొండ మండల పరిధిలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలో పలు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. భారీ వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాలలో భారీ చెట్లు నేరకొరిగాయి. గ్రామాలలో విద్యుత్ స్థంబాలు పడిపోయి విద్యుత్ అంతరాయం నెకొంది. రెవెన్యూ డివిజనల్ పరిధిలోని పెనుకొండలో అత్యధికంగా 89.8మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా రొళ్ళలో 21.4మిల్లీ మీటర్లు అత్యల్ప వర్షపాతం నమోదయింది. సత్తారుపల్లి, శెట్టిపల్లి, మునిమడుగు, గుట్టూరు, వెంకటగిరి పాలెం, చిన్నపురెడ్డిపల్లి గ్రామాలలో వరి , మొక్కజొన్న, వేరుశెనగ వంటి పంగలు 63హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. 99మంది రైతులు పంట నష్టం సంభవించి ఆర్థికంగా నష్టపోయారు. సత్తార్‌పల్లి గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి మూడు ఎకరాలలో ఉల్లిపాయ సాగు చేయగా వర్షానికి పూర్తిగా కొట్టుకుపోయి మూడు లక్షల రూపాయలు నష్టపోయారు. సోమవారం తెల్లవారుజామున మండల పరిధిలోగుట్టూరు గ్రామ సమీపాన వాగు ఉప్పొంగి ప్రవహించి జాతీయ రహదారిపై పరవాళ్ళు తొక్కడంతో జాతీయ రహదారి దాదాపు మూడు గంటల సేపు దిగ్బంధమైంది. నీటి ప్రవాహం వల్ల వాగు ఇరువైపులా దాదాపు 5కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి దీనితో కియా పోలీస్ స్టేషన్ ఎస్సై రాజేష్ వారి పోలీస్ సిబ్బంది తెల్లవారుజామున 5గంటల నుండి ట్రాఫిక్కను మళ్లించి ప్రయాణికులకు సహాయ సహకారాలు అందజేశారు. కొన్ని గంటల పాటు అక్కడే ఉండి వాహనాలను సురక్షితంగా పంపించారు. మహాదేవ్ పల్లి గ్రామ సమీపాన భారీ చెట్లు నేలకొరిగా ఆదే ప్రాంతంలో మరికొన్ని చోట్ల భారీ చెట్లు విద్యుత్ స్థంబాలపై పడటంతో విద్యుత్ స్థంబాల నేలకొరిగాయి దీనితో విద్యుత్ తీగలు తెగిపోయి కొన్ని గంటల పాటు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం నెలకొంది. మరువ వంక శెట్టిపల్లి వాగు మనుమడుగు ఉప్పంక వంటి వాకలు ఉప్పొంగి ప్రవహించాయి. దీనితో వెంకటగిరి పాలెం మనిమడుగు చెరువులు మరువ వంకలు పొంగి పొర్లాయి భారీ వర్షాలకు శెట్టిపల్లి చిన్నపరెడ్డిపల్లి దారులు కోతకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంది. మరికొద్ది రోజుల తుఫాను ఉండటంతో రైతులు గ్రామస్థులు ఆందోళనకు గురి అవుతున్నారు. ఇది ఇలా ఉండగా భారీ వర్షాలకు తీవ్రంగా పంటలు నష్టపోయిన, రోడ్లు ధ్వంసమైన, విద్యుత్ స్థంబాలు నేలకొరిగినా వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు, విద్యుత్ అధికారులు మరికొన్ని సంబంధిత ప్రభఉత్వ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో గ్రామస్థులు తీవ్ర అసహనానికి గురయ్యారు. రెండు, మూడు రోజుల్లో నైనా ధ్వంసమైన రోడ్లు, విద్యుత్ స్థంబాలు మరమ్మత్తుల చేపట్టడం, పంట నష్టం అంచనా వేయడం పూర్తి చేయాలని గ్రామసున్లఉ పత్రికా ముఖంగా మొరపెట్టుకుంటున్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్యను పెంచండి
- కో-ఆర్డినేటర్లకు ఏసి గోవిందనాయక్ ఆదేశం

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

ఏపి ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్యను గతంలో కంటే ఎక్కువగా పెంచాలని విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ ఆదేశించారు. మంగళవారం నగరంలో పొట్టి శ్రీరాములు స్కూల్‌లో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసి మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపి ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఇప్పటి వరకు 2300 అడ్మిషన్లు అయ్యాయన్నారు. గత ఏడాదిలో 3400 అడ్మిషన్లు అయ్యాయని, ఈసారి గతం కంటే ఎక్కువగా అడ్మిషన్లు 5వేలకు పెంచాలని ఆదేశించారు. ఈ నెల 25 వరకు ఎలాంటి రుసుము లేకుండా, 26వ తేది నుంచి 29వ తేది వరకు రూ.200, 30 నుంచి 31 వరకు 500 అపరాధ రుసుముతో అడ్మిషన్లు పొందడానికి చివరి అవకాశం కలదన్నారు. కావున ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంచడానికి విస్తృతంగా ప్రచారం చేయాలని, 10 తరగతిలో చేరడానికి 14 సంవత్సరాలు నిండి ఉండాల న్నారు. ఇంటర్మీడియెట్‌లో చేర డానికి 10 పాస్ అయి 15 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులన్నారు. కావున ఆసక్తి ఉన్న అ భ్యాసకు లు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని కోరారు. అద నపు సమాచారం కోసం ఏపి ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ లేదా మీకు సమీపం లోని ఏఐ సెంటర్‌లను సంప్రదించి వివరాలు పొందాలన్నారు. అదే విధంగా ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన అభ్యా సకులకు పిసిపి తరగ తులు నిర్వహించడానికి వచ్చే వారం నుంచి అన్ని ఏర్పాట్లు చేసుకో వాలని కోఆర్డినేటర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ విభాగం సిబ్బంది ఖాన్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏసి గోవిందునాయక్

పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం
- ఎంపిడిఓ తేజోష్ణ - ఈఓ, అధికార పార్టీ నేతలతో కలిసి పెద్దకాలువను పరిశీలించిన ఎంపిడిఓ తేజోష్ణ

పామిడి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. ఈఓ, అధికార పార్టీ నేతలతో కలిసి మంగళవారం పట్టణంలో పర్యటించి ఎంపిడిఓ తేజోష్ణ పెద్దకాలువ, టీచర్స్ కాలనీకి ఆనుకుని చిన్న పాటి చెరువును తలపిస్తున్న ఓ ప్రైవేట్ స్థలాన్ని పరిశీలించారు. ప్రజాభ్యు న్నతిని ఆకాంక్షిస్తూ పట్టణాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పెద్ద కాలువ పూడిక తీసివేసి కింద బెడ్డింగ్, సైడ్ వాల్స్‌తో డ్రైనేజీ బయటకు రాకుండా పైన మూసివేసే నిర్మాణ పనులను త్వరలోనే చేపట్ట డానికి నివేదికలను సిద్ధం చేస్తున్నామని ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పోలీస్‌స్టేషన్ పక్కనున్న స్థలాన్ని శుభ్రం చేయించి బిసిసి రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి తోపుడుబండ్లను అక్కడకు తరలిస్తామని తెలియజేశారు. ఇదే క్రమంలో ఎక్కడా డ్రైనేజీ పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా వర్షపు నీరు చెరువులను తలపిస్తూ ప్రజాజీవనానికి ఇబ్బందులు తలెత్తకుండా మీ స్థలాలను మీరే పరిరక్షించుకోవాలని ప్రైవేట్ స్థలాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని గ్రామపంచాయితీ ఈఓ గోపాల్‌ను ఆదేశించారు. టిడిపి నేత ఆర్ఆర్.రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపి స్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లక్ష్యానికి అనుగుణంగా గుంత కల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాలతో పామిడి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ సమన్వయంతో అధికారులతో కలిసి పామిడిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.డబూ య్ఎస్, పంచాయి తీరాజ్ ఏఈలు తిరుపాల్ నాయక్, హేమ్లానాయక్, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కత్తి మల ప్రభాకరచౌదరి, టిడిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి బొల్లు శ్రీని వాసరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు జింకల సంజీవకుమార్, నాయకులు బొమ్మా మోహన్, గ్రామ పంచాయితీ శానిటరీ మేస్త్రీ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈఓ, అధికార పార్టీ నేతలతో కలిసి పెద్ద కాలువను పరిశీలిస్తున్న ఎంపిడిఓ తేజోష్ణ

స్థలాలను పరిరక్షించుకోండి లేదంటే చట్టాన్ని అనుసరించి చర్యలు
- ప్రైవేట్ స్థలాల నిర్వాహకులకు గ్రామ పంచాయితీ ఈఓ గోపాల్ హెచ్చరిక

పామిడి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

ఎవరి స్థలాలను వారు పరిరక్షించుకోవాలని లేదంటే చట్టాన్ని అనుసరించి చర్యలు తీసుకుంటామని ప్రైవేట్ స్థలాల నిర్వాహకులను గ్రామ పంచాయితీ ఈఓ గోపాల్ హెచ్చరించారు. ఈమేరకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశ:లో ఈఓ గోపాల్ మాట్లాడుతూ.. ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా పట్టణ సుందరీకరణ అభివృద్ధికి అధికారులుగా మేము తలపెట్టిన మహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పట్టణంలో పలుచోట్ల ప్రైవేట్ వ్యక్తుల స్థలాలు ముళ్లచెట్లు పెరిగిపోయి చెత్తా చెదారం పేరుకుపోవడం వర్షపు నీరు నిలిచి పోయి చిన్న పాటి చెరువులను తలపిస్తుండటం కారణంగా దుర్వాసన వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారుతుండటం ద్వారా సమీప నివాస ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతుండటమే కాక పట్టణ అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తోందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పామిడిని ఆదర్శవంతంగా తీర్చి దిద్దటానికి బిసిసి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ ల్లో పూడిక తీసివేత కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తూనే ట్రాఫిక్‌కు అంతరా యం కలగకుండా ఆక్రమణలను తొలగి స్తున్నామని భవిష్యత్తుతో షాపులు దుకాణదారులు డ్రైనేజీ కాలువ దాటి నిర్మాణాలను చేపడితే పంచాయి తీరాజ్ చట్టాన్ని అను సరించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే క్రమంలో ప్రైవేట్ స్థలాల నిర్వా హకులు తమ తమ స్థలాల్లో పెరిగిన ముళ్లచెట్లను తొలగించి చిన్నపాటి చెరువులను తలపిస్తున్న వర్షపు నీటిని దారిమళ్లించి పరిశుభ్రంగా ఉంచుకుంటూ వారి వారి హద్దుల్లో స్థలాలను పరిరక్షించుకోవాలని లేని పక్షంలో అధికారులు తీసుకోబోయే చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు.

మాట్లాడుతున్న గ్రామ పంచాయితీ ఈఓ గోపాల్

ఇద్దరు లేక ఎంతమందైనా కనవచ్చు అని చంద్రబాబు పిలుపు
- చంద్రబాబు వ్యాఖ్యలను తప్పు పట్టిన కెవి.రమణ

అనంతపురం, అక్టోబర్ 22 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసే రాజకీయాలకు ఏదీ అనర్హం కాదు. ప్రతి అంశాన్ని, ప్రతి అవకాశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని వైఎస్ఆర్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి.రమణ ఆరోపించారు. సోమవారం ఆయన విడుదల చేసి న ఒక ప్రకటనలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలను తప్పుపట్టారు. రాష్ట్రంలో రోజురోజుకు జనాభా తగ్గిపోయి, కుంబాలు కుచించుకుపోతు న్నాయట, అందు కోసం ఒక్కొక్కరు 16 మందిని కని జనాభాతోపాటు కుటుంబాలను పెంచాలట, జనాభా తగ్గుదల పట్ల పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెరగవట, తద్వారా పార్లమెంట్‌లో మన రాష్ట్రం బలం పడిపోతుందట, అసెంబ్లీ స్థానాలు తక్కువ ఉన్నందున తన పార్టీలో కొంత మంది నాయకులకు అవకాశాలు రావట, అందుకని ఇద్దరు లేక ముగ్గురు అనే నినాదాన్ని తీసేసి ఇద్దరు లేక ఎంత మందైనా అనే నినాదాన్ని తీసుకువస్తాడట, తీసుకురావడంతోపాటు గతంలో స్థానిక సంస్థలకు పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉండకూడదనే నిబంధన కూడా తొలగిస్తాడట అన్నారు. ఇదంతా ఎందుకంటే పార్లమెంట్‌లో మన బలాన్ని నిరూపించుకోవడానికి, జనాభా ప్రాతిపదికన ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఎక్కువ రావడానికట, ఇది ఎలా ఉందంటే తాటి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడకు గడ్డి కోయానికి అన్నట్లు ఉందన్నారు.

కెవి.రమణ

అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణపై ప్రముఖ ఛానల్‌లో వచ్చిన అసత్య ప్రచారాలను ఖండిస్తున్నాం - బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో వివిధ బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కుల సంఘాల నాయకులు, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు మీడియాని ఉద్దేశించి మాట్లాడుతూ.. వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధి కొరకు నిరంతరం శ్రమిస్తూ పార్లమెంట్ సమావేశాల్లో జిల్లా ప్రజల తరపున తన గొంతుకను వినిపిస్తూ సూటిగా జిల్లా అభివృద్ధి కొరకు తనవంతు కర్తవ్యంగా ముందుకు వెళ్తున్నటువంటి అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం జిల్లా ప్రజల మద్దతు ఎల్లవేళలా ఉంటుందని వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు కూడేరు బ్రహ్మయ్య, అంకె ఈశ్వరయ్య, ఐఎంఎం బాషా, చంద్రాచర్ల హరి, బిజెపి నాయకులు గొట్లూరు చంద్ర, వాల్మీకి సంఘం రాయలసీమ అధ్యక్షులు సాంబ, దండు శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. అనంతపురం అభివృద్ధి చెందాలంటే అంబికా లక్ష్మీనారాయణతోనే సాధ్యమనే రకంగా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకు వెళ్తూ ప్రజలలో ఒకడిగా అందరి ఆదరాభిమానాలను చూర గొంటున్నటువంటి అంబికా లక్ష్మి నారాయణపై ఒక మీడియాలో ప్రచురితమైన అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అనంతపురం జిల్లాలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కావా లని ఉద్దేశ్యంతో చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. ఎంపి చొరవతో గుంతకల్లు నుంచి బెంగుళూరు వరకు ప్యాసింజర్ రైలును తిరిగి ప్రారం భించడం జరిగిందన్నారు. అనంతపురం నగర అభివృద్ధి రొకు రింగ్ రోడ్ విషయమై పార్లమెంట్ సమావేశాల్లో స్పష్టంగా ఆయన వానిని వినిపిం చిన విధానం అద్భుతమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు

నవంబర్ 24న నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పంపిణీ

అనంతపురం కల్చరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

10వ తరగతి, ఇంటర్మీడియెట్ 2023-24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు నవంబర్ 24వ తేదీన స్థానిక జయమనెమ్మ కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేయనున్నట్లు నాయీబ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షే మ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరంగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్టిసి ఎం.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. 10లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 480, ప్రైవేట్ పాఠ శాలల విద్యార్థులు 520 మార్కులు పై సాధించిన వారు అర్హులన్నారు. అదే విధంగా ఇంట్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 850 ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు 900 మార్కులుపైబడి సాధించిన వారు నవంబర్ 15వ తేదీలోపు ఎం.శ్రీనివాసులు ఆర్టిసి డోర్ నెంబర్ 18/1/406 వేణుగోపాల్ నగర్, పాతూరు అనంతపురం చిరునామాకు దరఖాస్తులను పంపించాలన్నారు. ఇతర వివరాలకు 9440 5014 63, 9441222874 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని నాయీబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, జిల్లా గౌరవ సలహా దారులు శివ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి విజయనగరం నాగరాజు, జిల్లా కార్యదర్శి శివ శంకర్, జిల్లా కోశాధికారి నాగ రాజు, నాయకులు జెవి.రమణ, బిసి వరద రాజులు, శివయ్య, ఎక్సైజ్ నరసింహులు, కరెంట్ రామాంజినేయులు, ఎం. రామాం జినేయులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నేతలు

శింగనమలలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

శింగనమల, అక్టోబర్ 22 ప్రభాతవార్త

మండల కేంద్రంలో బిజెపి నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ గంగా రాజేష్ ఆధ్వర్యంలో భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం నేడు అభివృద్ధి వైపు దూసుకుపోతోం దంటే దానికి కారణం బిజెపి అని భవిష్య త్తులో భారత్ పటిష్టంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ భారతీయ జనతాపార్టీని బలపర్చాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ నాయకులు రవిరాజ్, మండల కన్వీనర్ ఓబిరెడ్డి, ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వాన్ని అందిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపల్లిలో పాలం పిలుస్తోంది

అనంతపురం రూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం ఎ.నారాయణపురం, నాగిరెడ్డి పల్లిలోని రైతు సేవా కేంద్రాల సమీపంలోని రైతుల పొలాల్లో ఏఓ శశికళ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులు వేచిన పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేసి రైతల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వారు మట్టీ పరీక్ష ఫలితాల కార్డులు,కౌలు రైతు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంఐపి అధికారి హరిత,ఏఈఓ మురళి కృష్ణ,వెటర్నరీ అసిస్టెంట్ జగదీష్,సెరికల్చర్ అధికారి ఓబులేసు, రైతు సేవా సిబ్బంది నాగలత,ఇతర శాఖ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో పాలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

డి,కె తాండాలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు

ఆత్మకూరు అక్టోబర్ 22 ప్రభాతవార్త

ఆత్మకూరు మండల పరిధిలోని డి,కె తాండా గ్రామంలో న్యాయ సేవా సాధికార సంస్థ,గిరిజన కార్పోరేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయ సేవ సాధికార సంస్థ సెక్రెటరీ జడ్జి శివప్రసాద్,ఎస్టీ కార్పోరేషన్ అధికారి శంకర నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి శివప్రసాద్ మాట్లాడుతూ నేషనల్ సర్వీస్ అథారిటీ యక్ట్ ప్రకారం జిల్లాలో న్యాయ సేవా సంస్థ ఏర్పాటు చేయడం జరిగింది దీనికి చైర్మెన్‌గా జడ్జీ ఉంటారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వినియోగించుకోవాల ని,న్యాయఽరమైన టువంటి సహాయం చేయడానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పనిచే స్తుందని సూచించారు.సమాజంలో చిన్న పిల్లలపైన లైంగికంగా వేదిం పులకు గురై నప్పుడు పోక్సో చట్టం పైన కేసు విధించి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలియజేశారు. వాహ వాలు నడిపేటప్పుడు మద్యం సేవించి నడపరాదని,వెహికల్ లైసెన్స్‌లు పొంది ఉండాలన్నారు. బాల్య వివాహాలను జరగకుండా చూడడం, మహిళల పై దౌర్జన్యాలు చేయ డం, చిన్న పిల్లలపై వేదింపులు చేయడం మొదలగు వాటిని జరగకుండా చూడ్డానికి చాలా చట్టాలు,న్యాయస్థానం పనిచేస్తుందని తెలిపారు. అన్ని వర్గాల పిల్లలకు ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం రెసిడెన్సి యల్ పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు.ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని పిలుపుని చ్చారు.పిల్లలను ఉన్నత స్థాయికి వెల్లునట్లు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలను ఎస్సీ,ఎస్టీ వర్గాలు ప్రజలు ఎక్కువగా ఉప యోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఎస్సీ,ఎస్టీ వర్గాలు కలిగిన ప్రాం తా ల్లో మౌలిక వసతులు కల్పనకు వారి అభి వృద్ధికి వివిధ రకాల పథకా లుప్రభుత్వం అమలు చేస్తుందని వాటిని తప్పక ఉపయోగిం చుకోవాలని దిశా,నిర్దేశం చేయడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జడ్జి శివప్రసాద్ ప్రారంభించారు.వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మినాయక్,ఎంపిడిఓ లక్ష్మినరసింహ,యంపిపి హేమలత,సర్పంచ్ నాగరత్నమ్మ, మాజీ జడ్పిటిసి కుళ్ళాయప్ప, పంచాయితీ కార్యదర్శి మహ బూబ్ భాషా, వీఆర్వో రఫీ,ప్రభుత్వ వైద్యులు సబీహా సుల్తానా,ఏపిఓ సుజా త, ఇంజనీర్లు శివకుమార్, జమీల్ భాషా,అగ్రికల్చర్ అధికారిని సుచరి త,ఏఈఓ సుజిత, లావణ్య గ్రామప్రజలు,అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగిస్తున్న జడ్జ్ శివప్రసాద్

ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జడ్జి

పనిచేయని బయోమెట్రిక్ పరికరాల వివరాలు సేకరణ
- రాత పూర్వకంగా రాయించుకుంటున్న సంక్షేమ శాఖల అధికారులు - హర్షం వ్యక్తం చేస్తూ వార్త యాజమాన్యంకు కృతజ్ఞతలు తెలియజేసిన వార్డెన్లు

వార్త ప్రభావం

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థుల బయోమెట్రిక్ హాజరు వేయడానికి వార్డెన్లు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 22న వార్త దిన పత్రికలో నెట్ చార్జీలు ఇవ్వరు..సరిగ్గా పనిచేయని బయోమెట్రిక్ పరికరాలు...! అనే శీర్షికతో కథనం ప్రచురితం అయింది. ఇందుకు ఎస్సీ వేల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి , బీసీ వేల్ఫేర్ డైరెక్టర్ మల్లికార్జున స్పందించారు. ఈస మస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని వార్త విలేఖర్‌కు వాట్సాఫ్ ద్వారా తెలియజేశారు. అదే విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, డివిజన్ స్థాయి అధికారులు కూడా వారి అధికారిక వార్డెన్ల వాట్సాస్ గ్రూపు ల్లో వార్తలో వచ్చిన న్యూస్ క్లిప్పింగ్ షేర్ చేసి, దాని కింద ఏ హాస్టల్‌లో అయినా బయోమెట్రిక్ పరికరాలు పనిచేయకపోతే రాత పూర్వకంగా తమ దృష్టికి తీసుకురావాలని మిస్సెజ్‌లు పెట్టడం జరిగింది. ఇందుకు ఆయా వార్డెన్లు కూడా వెంటనే స్పందించి తమ హాస్టల్లో బయోమెట్రిక్ పరికరాలు పనిచేయడం లేదని, పాతవి కావడంతో చాలా స్లోగా ఉన్నాయని, రిపేర్లు చేయించామని, మరి కొందరు అయితే తాము సొంతంగా పరికరాలు కొనుగోలు చేసి బయోమెట్రిక్ హాజరు వేస్తున్నామని ఇలా పలు రకాలుగా వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నెట్ చార్జీలు, బయోమెట్రిక్ పరికరాలు పనిచేస్తున్నాయో లేదో అన్న వివరాలను రాత పూర్వకంగా వార్డెన్ల ద్వారా ఏఎస్‌డబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు సేకరిస్తున్నారని, వారి ద్వారా జిల్లా కార్యాలయాలకు తెప్పించుకోని వాటిని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అనంతపురం జిల్లా ఎస్సీ, బీసీ వేల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, శ్రీ సత్యసాయి జిల్లా బీసీ వేల్ఫేర్ జిల్లా అధికారిణి నిర్మలజ్యోతి, ఎస్సీ వేల్ఫేర్ జిల్లా అధికారి శివరంగప్రసాద్ తెలిపారు. అయితే తమకు చాలా సంవత్స రాలుగా నెట్ చార్జీలు లేక, బయోమెట్రిక్ పరికరాలు పనిచేయకపోవడంతో హాజరు వేయడానికి తాము పడుతున్న ఇబ్బందులను వార్త పత్రికలో ప్రత్యేక కథనం రాసి తమ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారుల దృ ష్టికి తెచ్చిన వార్త యాజమాన్యంకు వార్డెన్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతాంగ సమస్యలపై దృష్టి సారించండి
- వ్యక్తిగత విమర్శలు మానుకోండి - మేయర్ వసీం

అనంతపురం సిటీ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

జిల్లాలోని రైతాంగం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి, వ్యక్తిగత విమర్శలు మానుకోవాలంటూ నగర మేయర్ వసీం టిడిపి నేతలకు సూచించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో మంగళవారం మేయర్ వసీం కార్పోరేటర్లు సైఫుల్లా బేగ్, నరసింహులుతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రయత్నం చేస్తే వాటిని పరిష్కరించకుండా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్‌లు వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. జిల్లాలో అధిక వర్షాల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, నష్టపోయిన రైతులను ఆదుకోవడంతోపాటు రబి సీజన్‌కు విత్తనాలు అందించడం, ఎరువులను అందుబాటులో ఉంచడం, తుంగభద్ర, హంద్రీనీవా ద్వారా సాగునీటిని తీసుకురావడంపై ఏ చర్యలు చేపట్టారో ప్రజలకు చెప్పాలన్నారు.

అదే విధంగా అనునిత్యం టిడిపి నేతల ఇసుక దందాలు, మద్యం దుకాణాల కోసం బెదిరింపులపై ప్రధాన పత్రికల్లో ప్రముఖంగా వస్తు న్నాయని, వాటిపై సమాధానాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా నగర అభివృద్ధికి ఏం చేస్తున్నారో చెప్పాలన్నారు. వెనుకబడిన అనంతపురం జిల్లాకు కృష్ణ జలాలు వచ్చాయి అంటే దివంగత నేత వైఎస్ఆర్ సహకారంతో నాడు ఎంపిగా ఉన్న అనంత వెంకటరామిరెడ్డి, మంత్రిగా ఉన్న రఘువీరారెడ్డి వల్ల మాత్రమే సాధ్యమైందన్నారు. నాలుగు సార్లు ఎంపిగా, ఒకసారి ఎమ్మెల్యేగా అనంత వెం కటరామిరెడ్డి జిల్లాలో చేసిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంద న్నారు. కార్పోరేటర్ సైఫుల్లా బేగ్ మాట్లాడుతూ.. ప్రజల పక్షాన ప్రజల గొంతుకగా ప్రజా సమస్యలపై వైసీపీ జిల్లా అధ్యక్షునిగా అనంత వెంకటరా మిరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకె ళ్లడంలో తప్పేముందని ప్రశ్నిం చారు. జలయజ్ఞం ద్వారా కృష్ణ జలాలు జిల్లాకు తీసుకురా వడం లో అనంత వెంకటరా మిరెడ్డి తీసుకురావడంలో నిన్న విమర్శలు చేసిన నేతలు రాజకీయాల్లోకి వచ్చి ఉండక పోవడం వల్ల తెలియకపోయి ఉండవచ్చు న్నారు. అనంతపురం నగరా భివృద్ధికి నాలుగు నెలల పాలనలో దగ్గుపాటి ప్రసాద్ ఏం చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కార్పోరేటర్ నరసిం హులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా దగ్గుపాటి ప్రసాద్ పింఛన్లు పంపిణీ తప్పా ఏం చేశారన్నారు. మద్యం దుకాణాల్లో తాను బెదిరించలేదని, తన కార్యకర్తలు బెదిరి ంచారేమోనని చెప్పడం కార్యకర్తలను అగౌరవ పర్చడమేనన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు వ్యక్తిగత విమర్శలు మాని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని వారు సూచించారు. ఈ సమావేశంలో కార్పోరేటర్లు కమల్ భూషణ్, అనీల్‌కుమార్‌రెడ్డి, రహంతుల్లా, వైసీపీ నాయకులు రామచంద్ర, కాకర్ల శీన తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేయర్ మహ్మద్ వసీం

బాలికలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకెళ్లాలి - ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

పామిడి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

విద్యా రంగంలో బాలికలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకెళ్లాలని ఆర్డిటి రీజనల్ డైరెక్ట

04ATP22_04ATP22.qxd 22-10-2024 PM 11:12 Page 1

రూరల్‌లో భారీ వర్షంతో పలు కాలనీలు జలమయం

రాచానపల్లి వద్ద వంక పొంగడంతో విలేఖరుల కాలనీకి రాకపోకలు నిలిచిపోయాయి - పలు వీధులు,ఇండ్ల, కాలనీ లోకి చేరిన వర్షపు నీరు - చెరువులా మారిన ఉప్పరపల్లి జగనన్న కాలనీ

విలేఖర్ల కాలనీకి పోవు దారిలో ఉధృతంగా పారుతున్న వంక.

ఉప్పరపల్లి లోని జగనన్న కాలనీలో వర్షపు నీరు చేరడంతో చెరువును తలపిస్తున్న దృశ్యం.

చిన్నంపల్లిలోని మల్లయ్య కాలనీలో చేరిన నీటిని పరిశీలిస్తున్న సర్పంచ్,

అనంతపురం రూరల్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండల పరిధీలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రూరల్ మండలంలోని, చిన్నంపల్లి, ఉప్పరపల్లి,సోమలదొడ్డి, అనంత రూరల్‌లోని రామకృష్ణ కాలనీ, టివి టవర్ సమీపంలోని గ్రామ పంచాయితీలోని పలు కాలనీలు అన్నీ జలమయం అయ్యాయి. పై భాగంలో ఉన్న చెరువులు తెగిపోవడంతో ఆ చెరువులల్లోని నీరు అంత పండ మేరులోని చెరడంతో ఉప్పర పల్లి పంచాయితీలోని జగనన్న కాలనీ, ఆటోనగర్ అంత చెరువులా మారి పోవడంతో కాలనీల్లో నివాసించే ప్రజల నిత్యవసర సరుకు లు, సామాగ్రి అంత నీటీపాలు అయిపో యాయి.నీరు చేరిన జగనన్న కాలనీ లో టిడిపి యువ నాయకుడు, ధర్మ వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్,జెసి శివ్ నారాయణ్ శర్మ,అధికారులు,స్థానిక నాయకులతో కలసి పర్యటించి ప్రజలతో వారికి జరిగిన నష్టంను అడిగి తెలుసుకుని కాల నీలో ప్రజలందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అన్నీ వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. చిన్నంపల్లి పంచా యితీలోని మల్లయ్య కాలనీ,ఆదే విధంగా అనంత రూరల్ పంచాయితీ లోని రామకృష్ణ కాలన్నీ,నారా లోకేష్ కాలనీ సుశీలరెడ్డి కాలనీ, తిమ్మానాయుడు కాలనీ, అభ్యుదయ కాలనీ,టీవి టవర్ ,రాచానపల్లి పంచాయితీలోని విలేఖర్ల కాలనీకి పోవు దారి సమీపంలో గల వంక ఉప్పరపల్లి పంచాయితీలోని జగనన్న కాలనీలో వర్షపు నీరు చేరిన విషయాన్ని తెలుసుకున్న ఆర్‌డిఓ,రూరల్ డీఎస్పీ,తహశీల్దార్ మోహన్ కుమార్, ఎంపిడిఓ దివాకర్,ఇటుకలపల్లి సిఐ, ఎస్ఐ,స్థానిక సర్పంచ్ సావిత్రీ శ్రీనివాసులు, ఎంపిటీసి రామలక్ష్మమ్మ, పంచాయితీ కార్యదర్శి బాబాఫకృద్దీన్, విఆర్ఓ జయప్రకాష్,రెవిన్యూ,పోలీసు సిబ్బంది అందరు పర్యటించి కాలనీలోని ప్రజ లందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి భోజన సదుపాయాలు కల్పించారు. అదే విధంగా రామకృష్ణ కాలనీ, నారా లోకేష్ కాలనీ సుశీలరెడ్డి కాలనీ,తి మ్మానాయుడు కాలనీ, అభ్యుదయ కాలనీలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటీ ప్రసాద్ స్థానిక సర్పంచ్ ఉదయ శంకర్, అధికారులతో కలసి వరద చేరిన కాలనీలో పర్యటించి ప్రజలతో వారికి జరిగిన నష్టంను అడిగి తెలుసుకుని కాలనీలో ప్రజల ందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అన్నీ వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.చిన్నంపల్లి పంచాయితీలోని మల్లయ్య కాలనీలోని వర్షం నీరు చేరిన ప్రాంతంలో గ్రామ సర్పంచ్ శివశంకర్ కాలనీ ప్రజలతో కలసి పర్యటించి వారికి జరిగిననష్టం అడిగి తెలుసుకుని వారికి సహాయ సహకారాలు అందించారు. రాచానపల్లి పంచాయితీలో పై నుంచి వర్షపు నీరు అధికంగా రావడంతో గ్రామ సమీపం లోని వంక పారుతుండంతో విలేఖర్ల కాలనీ,కొడిమి కోట్టాల,దర్గా కోట్టాల, అనేక కాలనీకు రాకపోకలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోన్నారు. జగనన్నకాలనీ,ఆటోనగర్,మల్లయ్య కాలనీ, రామకృష్ణ కాలనీ,నారా లోకేష్ కాలనీ సుశీలరెడ్డికాలనీ, తిమ్మానాయుడు కాలనీ,అభ్య దయ కాలనీ,ల్లో వర్షపు నీరు చేరడంతో కాలనీలో నిలిచిన వర్షపు నీటీని తొలగింపుకు అధికారులు మార్గాలు అన్వేషించడం జరుగుతుంది.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి - ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రితౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

సచివాలయాల ఉద్యోగులు తాడిపత్రి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో సచివాలయం ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరిం చడంలో సచివాలయం ఉద్యోగుల పాత్ర చాలా ముఖ్యమన్నారు. సచివాలయం ఉద్యోగులు పారదర్శకంగా పనిచేయాలని నిబంధనలకు విరుద్ధంగా పనిచేయ కూడదని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తాడిపత్రి పట్టణ అభివృద్ధిలో సచివాలయం ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ దుస్తులను అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం జె.సి సచివాలయం ఉద్యోగులకు విందు ఏర్పాటు చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

పేదలకు పట్టాలు ఇవ్వాలి

- గ్రామీణ పేదల సంఘం జిల్లా కన్వీనర్ ఏ నాగభూషణ

గార్లదిన్నె, అక్టోబర్ 22 ప్రభాతవార్త

గార్లదిన్నె మండలంలోని మండల పరిదిలోని తహశీల్దారు కార్యాలయం ఆవరణంలో తహశీల్దార్ ఈరమ్మకు వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించి గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలకు ఇంటింటా సర్వే చేపట్టి అర్హులైన వారికి గృహ నిర్మాణం కొరకు ఇంటి స్థలాల మంజూరు చేయాలని అలాగే గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి నిరుపేదలకు ప్రబుత్వం భూమి కొనుగోలు చేసే భూమి పంపిణీ క ఆర్యక్రమాన్ని చేపట్టాలని అలాగే దేవాదాయ శాఖకు సంబంధించినటువంటి భూములను భూమిలేని నిరుపేదలకు కౌలుకు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని అలాగే అర్హులైన పేద ప్రజలకు రేషన్‌కార్డులు, గ్రామీణ ప్రాంతాలలో రైతులకు వస్తా పొలాలకు వెళ్లే విధంగా చేపట్టాలని ఆయన అధికారులను కోరడమైంది. అలాగే మండల అభివృద్ధి అధికారి యోగాలో పలు గ్రామీణ ప్రాంతాలలో సిసి రోడ్లు ఇంటింటి కొళాయిలు మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకంలో అవకతవకలను అరికట్టాలని అలాగే ఫారం ఫండ్స్ ద్వారా నిరుపయోగంగా వెళ్తున్నటు వంటి వరుస ద్వారా నీటిని విలువ చేసే విధంగా చెక్ డ్యా ములు నిర్మించాలని ఆయన అధికారులకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రం మలో గ్రామీణ పేదల సంఘం నాయ కులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అనంతపురం జిల్లాలో భారీ వర్షం

(మొదటి పేజీ తరువాయి) ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు అలాగే సచివాలయ సిబ్బంది బాధిత కాలనీల్లోనే ఉంటారని, వారికి ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందిస్తారన్నారు.

అపార నష్టం జరిగింది : ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు నియోజకవర్గంలో అనుకోకుండా కురిసిన భారీ వర్షాం వలన అపార పంట నష్టం, పశు నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే పరి టాల సునీత అన్నారు. గత రాత్రి నుంచి రామగిరి, చెన్నేకొ త్తపల్లి, కనగానపల్లి మండల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చాలా చోట్ల చెక్ డ్యాంలు, కల్వర్టులు తెగి పోయాయి. దీంతో ఈ నీరంతా పంట పొలాలు రోడ్లలో పొంగిపొల్లింది. వేలాది ఎకరాల్లో వేరుశనగ, టమోటా వంటి పంటలకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న పరిటాల సునీత రాత్రి మూడు గంటల నుంచి సహా యక చర్యలని పరివేక్షించారు. వెంకటాపురం నుంచి బయట ప్రాంతాలకు వచ్చేందుకు ఉన్న మూడు రహదారుల్లో పెద్ద ఎత్తున వరద నీరు ఉండటంతో బయటికి రాలేక పోయారు. వరద ప్రవాహం కాస్త తగ్గిన తర్వాత పరిటాల సునీత వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం ఆస్తి నష్టంపై ఆరా తీశారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుకోకుండా వచ్చిన వర్షాల కారణంగా భారీ నష్టం వాటిల్లిందని కచ్చితంగా రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తామన్నారు.

బాధితులకు సహాయం చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఉపాధిహామీ పనుల్లో అంతులేని అవినీతి, అక్రమాలు..!

(మొదటి పేజీ తరువాయి) మాత్రమే రికవరీకు ఆదేశించి, 7,26,201 రూపాయలను అక్రమాలను సరిచేసుకోవడానికి అవకాశం ఇచ్చి కేవలం 1,73,500 రూపాయలను ఫైన్ వేసింది. గతానికి భిన్నంగా ఈసారి సామాజిక తనిఖీ బృందాలు భారీగా అక్రమాలను వెలికి తీసినా అక్రమార్కులపై మాత్రం చర్యలకు తావులేకుండా నామమాత్రంగా రివకరీకు ఆదేశించడం విమర్శలకు తావిస్తోంది.

ప్రజా వేదికకు హాజరుకాని ఫీల్డ్ అసిస్టెంట్లు : ప్రజా వేదిక కార్యక్రమానికి ఒక్క ఫీల్డ్ అసిస్టెంటు కూడా హాజరు కాలేదని తెలిసింది. అవినీతి, అక్రమాలకు సమాధానం చెప్పాల్సి వస్తుందన్న ఉద్దేశంతోనే వారు ప్రజావేదికకు హాజరు కాలేదని తెలుస్తోంది. సామాజిక తనిఖీ బృందాలు పంచాయతీల వారిగా తనిఖీ వివరాలు వెల్లడిస్తుండగా అన్నీ తామై ఏపీఓ విమల, ఈసీ వంద్రప్ప సమాధానం చెప్పడం కనిపించింది. అయితే ప్రజా వేదికకు హాజరుకాని ఫీల్డ్ అసిస్టెంట్లపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి : కూలీలు వలస పోకుండా ఉన్న ఊళ్లోనే వారికి పని కల్పించాలన్న ఉద్దేశంతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీకు చెందిన మాజీ ఎంపీపీ వి.సుంకరత్నమ్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ రేగటి నాగరాజు, లత్తవరం, మోపిడి, ఇంద్రావతి గ్రామాల సర్పంచులు బోదపాటి గోవిందు, బోయ గోవిందు, యర్రగుంట్ల వెంకటేష్, పెద్దముష్టూరు బోస్, క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. బోగస్ కూలీలను సృష్టించడం, చేయని పనులు చేసినట్లు వేలు, లక్షలాది రూపాయలు దోచుకోవడం దారుణమని మండిపడ్డారు. అక్రమార్కుల నుండి అణాపైసలతో సహా రికవరీ చేయాలని పట్టుబట్టారు.

ఆందోళనలు, నిలదీతలు జరుగకుండా రాజీ మార్గం : కాగా మంగళవారం ఉరవకొండలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగనున్న క్రమంలో సోమవారమే ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది కొందరు గ్రామాలకు చెందిన అధికార పార్టీ నాయకుల వద్దకు వెళ్లడం, ఫోన్లు చేసి ఎవైనా తప్పులుంటే సర్ధుకోవాలని ఇకపై మీరు చెప్పినట్లే నడుచుకు ంటామని రాజీ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కొందరు అధికార పార్టీ నాయకులు అక్రమాలు తమ దృష్టికి వచ్చినా పట్టించుకోలేదని తెలిసింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పర్యటన

- పండమేరు వంక ఉధృతంగా ప్రవహించడంతో ఐదు కాలనీల్లోకి నీరు - బాధితులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి - ఎలక్ట్రిసిటీ గెస్ట్ హౌస్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశాం - భారీ వర్షాలపై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉన్నాం

అనంతపురం అర్బన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త

అనంతపురం నగరంలో వరద బాధిత కాలనీల ప్రజలకు అండగా ఉ న్నామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. విస్తృతంగా కురుస్తున్న వర్షాల కారణంగా పండమేరు వంక గత రాత్రి నుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రభావంతో అనంతపురం రూరల్ పంచాయితీలోని రామకృష్ణ కాలనీ, నారాలోకేష్ కాలనీ, సుశీలరెడ్డి కాలనీ, తిమ్మానాయుడు కాలనీ, అభ్యుదయ కాలనీల్లోకి వరద నీరు వచ్చింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇ బ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాత్రి నుంచి అధికారులను అప్రమత్తం చేశారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి సహాయక చర్యలు చేపట్టారు. వరద బాధితుల కోసం జెఎన్‌టియు వద్ద నున్న ఎలక్ట్రిసిటీ బోర్డు గెస్ట్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం వరద ప్రభావిత కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. బాధితులందరిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాలను ముందే అప్రమత్తం చేశామని, అందుకే నష్టతీవ్రత తగ్గిందని అన్నారు. మరోవైపు బాధితులకు పునరావాస కేంద్రం కూడా ఏర్పాటు చేశామని, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు అలాగే సచివాలయం సిబ్బంది బాధిత కాలనీల్లోనే ఉంటారని, వారికి ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందిస్తారన్నారు. నడిమి వంక, మరువ వంక ప్రాంతాల్లో ఎక్కడా నీటి ప్రవాహాలకు అడ్డంకి లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. రాత్రి వేళల్లో హఠాత్తుగా వరద నీరు వచ్చినా అది కాలనీల్లోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహశీల్దారు శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయరామ్‌నాయుడు, సర్పంచు ఉదయ్, అధికారులు, సచివాలయం సిబ ంది తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

మీ కష్టం చూస్తే కన్నీరు వస్తోంది.. అధైర్య పడకండి.. ఆదుకుంటాం

- వరద బాధితులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఓదార్పు - వ్యవసాయ, జలవనరుల శాఖ మంత్రులకు ఎమ్మెల్యే సునీత ఫోన్

తెగిన వంకను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

తెగిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బాధితులను పరామర్శిస్తున్న దృశ్యం

అనంతపురం, అక్టోబర్ 22 ప్రభాతవార్త బ్యూరో

అనుకోకుండా వచ్చిన భారీ వర్షం మిగిల్చిన నష్టం అంతా ఇంతా కాదని, రైతుల కష్టం చూస్తే కన్నీరు వస్తోందని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన ఆనరు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. చాలా చోట్ల చెక్ డ్యాంలు, కల్వర్టులు తెగిపోయాయి. దీంతో ఈ నీరంతా పంట పొలాలు, రోడ్లలో పొంగిపొర్లింది. వేలాది ఎకరాల్లో వరి, వేరుశనగ, టమోటా, ద్రాక్ష వంటి పంటలకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న పరిటాల సునీత ఉదయం నుంచి సహాయక చర్యలను పర్యవే క్షించారు. వెంకటాపురం నుంచి బయట ప్రాంతాలకు వచ్చేందుకు ఉన్న మూడు రహదారుల్లో పెద్ద ఎత్తున వరద నీరు ఉండటంతో బయటికి రాలేకపోయారు. వరద ప్రవాహం కాస్త తగ్గిన తర్వాత పరిటాల సునీత వర్ష ప్రభా విత ప్రాంతాల్లో పర్యటిం చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అలుపెరుగకుండా అన్ని ప్రాం తాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం ఆస్తి నష్టంపై ఆరాతీ శారు. ముందుగా రామగిరి మండలం, పోలేపల్లి, అక్కంపల్లి, కుంటిమద్ది, శ్రీహరిపురం గ్రామాల పరిధిలో భారీ వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ, వరి పంటలను పరిశీలించారు. బాధితులతో వివరాలడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి పంట నష్టం వివరాలు తీసుకెళ్లారు. రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కనగానపల్లి మండలం దాదులూరు గ్రామ సమీ పంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును పరిశీలించారు. దాదులూరు పోతులయ్య స్వామి ఆలయంలోకి కూడా పెద్ద ఎత్తున నీరు చేరడంతో ఆ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. మామిళ్లపల్లి నుంచి కనగానపల్లికి వెళ్లు రహదారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో బోల్తా పడిన టమోటా వాహనాన్ని పరిశీలించి ఎవరికైనా ఏమైనా జరిగిందా అంటూ ఆరాతీశారు. కనగానపల్లి చెరువు తెగిపోవడంతో పెద్ద ఎత్తున వరి పంట నీట మునిగింది. చెరువు తో పాటు పంట నష్ట పోయిన ప్రాంతాన్ని సునీత పరిశీలించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఫోన్‌లో మాట్లాడి చెరువు మరమ్మత్తులకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడి మరమ్మత్తుకు ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత రాప్తాడు మండలం ప్రసన్నాయ నపల్లి పంచాయితీలోని పండమేరు వాగు ఉధృతికి నీట మునిగిన కళాకారుల కాలనీ, జగనన్న కాలనీ, సద్గురు కాలనీలలో జిల్లా జాయింట్ కలెక్టర్, అధికారులతో కలసి పర్యటించి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ.. అనుకోకుండా వచ్చిన వర్షాల కారణంగా భారీ నష్టం వాటిల్లిందని కచ్చితంగా రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తామన్నారు. అధికారులు అంతా క్షేత్రస్థాయికి వెళ్లి పంట నష్టం అలాగే ఆస్తి, పశు నష్టాన్ని అంచనా వేయాలన్నారు. ఇప్పటికే మంత్రుల దృష్టికి జరిగిన నష్టాన్ని తీసుకెళ్ళగా వారు ఆదుకునేందుకు సానుకూలంగా స్పందించారని వివరించారు.

గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకో - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, అక్టోబర్ 22 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే బాలకృష్ణపై మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆమె పత్రికా సమావేశంలో మాట్లాడుతూ.. అధికారం కోల్పోయి ఇష్టాను సారం మాట్లాడు తున్న గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, గత ఐదు సంవత్సరాల్లో నీవు హిందూ పురం పార్లమెంట్‌కు ఏం చేశావో చెప్పా లన్నారు. నువ్వు చేసిన అవినీతి అక్రమాల వల్లనే కనీసం నీకు 2024లో వైఎస్ఆర్‌సిపి టికెట్ కూడా ఇవ్వలేద న్నారు. గత ఐదు సంవత్సరాలలలో ఏరోజూ ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి మాట్లాడిన సంఘటనలు కూడా లేవని, ఇప్పుడు వచ్చి మాట్లాడే అర్హత మీ పార్టీ నాయకులకుగానీ, మీ అధినేత కూడా లేదని ఆమె విమర్శించారు. వైసిపి నాయకుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నిందలు మోపి అభివృద్ధికి అడ్డుపడాలని ప్రయ త్ని స్తే సహించేది లేదన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అఘాం యిత్యాలకు పాల్పడిన వారిపై ప్రభు త్వం వెంటనే స్పందించి నింధి తు లను అరెస్టు చేసి కఠినంగా శిక్షిం చేందుకు చర్యలు చేపట్టారని తెలి పారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలను ఎలా కాపాడుకోవాలో మా ప్రభు త్వానికి తెలుసని ఘాటుగా స్పందించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

హంద్రీనీవా కాలువను 10వేల క్యూసెక్కుల సామర్థ్యానికి వెడల్పు చేయాలి

- గత ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన మాటను అమలు చేయాలి - డిస్ట్రిబ్యూటరీలపై మంత్రి పయ్యావుల కేశవ్ చొరవను స్వాగతిస్తున్నాం - విలేఖరుల సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

హంద్రీనీవా కాలువను కూటమి ప్రభుత్వం 10వేల కూ యిసెక్కుల సమర్థ్యానికి వెడల్పు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాం భూపాల్ డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువను వెడల్పు చేస్తామని గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా లోనే ప్రకటించారన్నారు. పట్టణంలోని సీపీ ఎం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమా వేశంలో ఆయన జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల రంగయ్య, బి.శ్రీనివాసులు, ఉరవకొండ ప్రాంతీయ కార్యదర్శి ఎ.రంగారెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.మధుసూదన్‌తో కలిసి మాట్లాడారు. వి.రాం భూపాల్ మాట్లాడుతూ హంద్రీనీవా పంట కాలువల గూర్చి రాష్ట్ర ఆర్థిక మంత్రి ఉన్న తాధికారులతో సమీక్ష నిర్వహించి డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పూర్తి చేయడానికి అంచనాలు తయారు చేయాలని ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అదే క్రమంలో కాలువ వెడల్పుపై కూడా దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. అనం తపురం జిల్లాకు అదనపు నీటిని తెచ్చుకునే ఒకేఒక వనరు హంద్రీనీవా కాలువని, తుంగభద్ర హెచ్ఎల్‌సీ నుండి తెచ్చుకోలే మన్నారు. ప్రస్తుతం హంద్రీనీవా కాలువ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు కాగా తద్వారా 40 నుంచి 50 టీఎంసీల నీటిని మాత్రమే తెచ్చుకోగలమన్నారు.

కాలువను 10వేల క్యూసె క్కుల సామర్థ్యానికి వెడల్పు చేస్తే 70 టీఎంసీల వరకు నీటిని తెచ్చుకో వచ్చన్నారు. కర్నూల్, చిత్తూరు జిల్లాలకు కూడా నీటిని తీసుకొని వెళ్లే వీలుం టుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి 2021లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించ డానికి జిల్లాకు వచ్చిన సందర్భంగా హంద్రీనీవా కాలువను 6,00 క్యూసెక్కుల సామర్థ్యానికి వెడల్పు చేస్తామని ప్రకటించి జీఓ కూడా ఇచ్చారని అయితే నిధులు మాత్రం కేటాయించకపోవడంతో కార్యరూపం దాల్చలేదని వి.రాం భూపాల్ ఎద్దేవా చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కాలువ వెడల్పు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి తొలిసారి జిల్లాకు చెం దిన పయ్యావుల కేశవ్ కావ డంతో ప్రజల్లో ఆశలు, అంచ నాలు పెరిగాయన్నారు. కనీస ం గత ప్రభుత్వం 2021లో ఇచ్చిన జీఓకు అనుగుణం గా నెనా కాలువ వెడల్పు చేయా లని కోరారు. అయితే ప్రస్తుత మున్న కాలువకు లైనింగ్ కోస ం అంచనాలు తయారు చేయ డానికి ప్రతిపాద నలు రూపొం దిస్తున్నటుల తెలుస్తోందని, రాయలసీమకు చెందిన విశ్రాంత ఇంజ నీర్ ఆప నిలో నిమగ్నమైనట్లు సమాచారం ఉందన్నారు. అదే జరిగితే జిల్లాకు శాపంగా మారుతుందన్నారు. అధికారులు ఇచ్చే అస్పష్టమైన అంచనాలు కాకుండా ప్రభుత్వ విధానాన్ని ప్రటికం చాలన్నారు. చెరువులు, కుంటలు వర్షా ల కారణంగా తెగిపోతున్నా యని రాప్తాడు మండలంలోని ఎం. బండ మీదపల్లిలో చెరువు తెగిపోయిం దన్నారు. దీంతో బోర్ల కింద సాగైన చీని తదితర పంటలు 350 ఎకరాల్లో కొట్టుకుపోయాయన్నారు. చెరువులు, కుం టల పరిరక్షణకు ఏడాది కాలానికి ప్రణాళిక ప్రకటించి నవంబర్ బడ్జెట్‌లో నిధులు కేటా యించాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల రంగయ్య మాట్లాడుతూ ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు వేరుశెనగ, మిరప, మొక్కజొన్న తదిత పంటలు దెబ్బతిన్నాయని నష్టాన్ని అంచనావేసి రైతులకు ఆదుకో వాలన్నారు. గత 2023 ఖరీఫ్‌లో 28 మండలాలు, రబీలో 14 మండలాను గత ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించిందని గతంలో అనావృష్టి నేడు అతివృష్టి కారణంగా రైతులు నష్టపోయారన్నారు. ఈ సమావేశంలో నాయకులు శీనప్ప, రామాంజినేయులు నాయక్, మురళి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజలను దోచుకొని ఆదాయం పెంచుకునే దిశగా చంద్రబాబు అడుగులు..!

- ప్రజలను మద్యానికి బానిసలుచేసి వారి కష్టార్జితాన్ని